క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కుభీర్: మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంక్ వద్ద సైబర్ నేరాలపై వినియోగదారులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీలు అపరిచితులకు చెప్పకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సై పి.రవీందర్, బ్యాంకు మేనేజర్ సంజుకుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్, మహాగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. మంగళవారం బోస్లే మోహన్‌రావుపటేల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో 60 మందికి వీ టిని అందించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో అభివృద్ధి

సారంగపూర్: శాస్త్రసాంకేతిక విద్యతోనే విద్యార్థుల అభివృద్ధి సాధ్యమని ప్లో బస్సుయాత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మధులాశ్‌బాబు అన్నారు. మండలంలోని చించోలి(బి) ఉన్నత పాఠశాలలో కలాం బస్సుయాత్రను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో శాస్త్రసాంకేతిక విద్య ముఖ్యమైన అంశమన్నారు. అబ్దుల్ కలాం ఆశయ సాధనకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు అర్చన, దిలీప్‌కుమార్, సుబ్రహ్మణ్యం, రోహిత్ తదితరులు ఉన్నారు.

పంటల వివరాల నమోదు

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ, నందన్ గ్రామాల్లో మంగళవారం ఏఈఓలు గణేశ్, రమ్య వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి పంటల వివరాలను నమోదు చేశారు. రైతుల పంటలను సర్వేనంబర్ ఆధారంగా ప్రత్యేక పోర్టల్‌లో పొందుపరిచారు. ఈ సర్వేతో మార్కెట్‌లో పంటను అమ్ముకునేందుకు ఇబ్బందుల్లేకుండా ఉంటుందని పేర్కొన్నారు.

'కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా బడ్జెట్'

ఖానాపూర్: పేదలు, కార్మికులు, రైతుల సమస్యలను పట్టించుకోకుండా బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా కేంద్రప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని బహుజన కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు పసుపుల వెంకన్న అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేట్ కంపెనీలకు ఎర్రతివాచీ పరిచేలా మోడీ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. బడ్జెట్‌లో తెలంగాణతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు నష్టం వాటిల్లిందని వాపోయారు.

కాల్వలు శుభ్రం చేయండి



మాట్లాడుతున్న సోలమాన్ రాజ్

లోకేశ్వరం: ప్రజలు రోగాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు మురుగుకాల్వలను శుభ్రం చేయాలని ఈవోపీఆర్డీ సోలమాన్‌రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని సేవాలాల్ తండాలో మురుగుకాల్వలు, నీటిట్యాంకు, నల్లాలను పరిశీలించారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో నీటి వృథాను అరికట్టాలన్నారు. ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయాలని పేర్కొన్నారు. సుమన్, అశోక్ ఉన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండలకేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం 24 మంది దివ్యాంగులైన విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు ఫిజియోథెరపిస్టు శ్రీనివాస్ తెలిపారు. అవసరమైన వారికి మందులు అందించినట్లు పేర్కొన్నారు. ఐఆర్‌టీ భూమన్న, రాము సిబ్బంది పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

భైంసాటౌన్: పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం వద్ద లబ్ధిదారులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఇళ్లు కేటాయించి ఏళ్లు గడుస్తున్నా.. తమకు అప్పగించడం లేదని వాపోయారు. అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్నామని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వేడుకున్నారు.

నూతన కార్యవర్గం

సారంగపూర్: ఫొటోగ్రాఫర్ల సంఘం మండల కార్యవర్గాన్ని మంగళవారం ఆ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం మండలాధ్యక్షుడిగా పరిణామ వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పెండారి భోజన్న, కోశాధికారిగా రాజు ఎన్నికయ్యారు.

మక్కకు 'కత్తెర' కాటు

- తెగులు సోకడంతో ఎండుతున్న పంటలు
- తగ్గనున్న దిగుబడి



కుంటాల మండలం ఓలా శివారులో ఎండుతున్న మొక్కజొన్న చేను



కత్తెరపురుగు సోకిన మొక్క

కుంటాల: ఆరుగాలం కష్టించి పనిచేస్తే రైతులకు కత్తెర పురుగు నష్టం చేస్తుంది. మండల రైతులు వానాకాలంలో పత్తి, సోయా పంటలు చేతికి రాగానే యాసంగి సీజన్‌లో మొక్కజొన్న సాగుపై దృష్టి సారిస్తారు. వానాకాలంలో అధిక వర్షాలు, తెగుళ్ల కారణంగా పత్తి, సోయా పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో వచ్చిన ఆదాయం పెట్టుబడులకే సరిపోయింది. యాసంగిలోనైనా తమ బాధలు తీరుతాయని మక్క సాగు చేస్తే కత్తెర పురుగు రూపంలో రైతుల ఆశలపై నీళ్లు చల్లుతుంది. దీంతో 30 నుంచి 85 శాతం వరకు పంట నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

సాగు ప్రారంభం నుంచి కత్తెర పురుగు...

కుంటాల మండలవ్యాప్తంగా సుమారు 6,165 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. విత్తనం విత్తినప్పటి నుంచి దిగుబడి వచ్చే వరకు వివిధ దశల్లో కత్తెర పురుగు ఆశిస్తుంది. ఆకులు తినేస్తూ కాండంలోకి ప్రవేశించి మొక్కను నాశనం చేస్తుంది. కత్తెర పురుగు ఉధృతితో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. ఒక్కో గుంపులో 300 నుంచి 400 గుడ్లు ఉండగా.. ఆకురంధ్రాల్లో 1500 వరకు కత్తెర పురుగు గుడ్లు పెడుతుంది. మూడు రోజుల తర్వాత పిల్లలను ఉత్పత్తి చేస్తుంది. కత్తెర పురుగు సోకిన మొక్క ఆకులు చారలుగా మారడం, పైభాగాల పురుగు విసర్జన పదార్థాలు కనిపించి కండెలను తినడం వంటి లక్షణాలు ఉంటే రైతులు జాగ్రత్త వహించాలి.

సస్యరక్షణ చర్యలు పాటిస్తే మేలు..

పంటను కత్తెర పురుగు ఆశిస్తే సస్యరక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. విత్తనం శుద్ధి చేసుకుని, లోతు దుక్కులు, పంట చుట్టూ కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. విత్తుకున్న 45 రోజుల తర్వాత వై ఆకారంలో కర్రలు 10 నుంచి 12 వరకు ఏర్పాటు చేసుకుంటే పక్షులు వాలి పురుగులను తింటాయి. ఎకరానికి 5 నుంచి 6 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. లీటర్ నీటికి రెండు గ్రాముల ఐటీ లేదా 5 గ్రాముల మెటారైజియం, ఎన్పైసోపిలి, లీటర్ నీటికి 0.3మి.లీ. క్లోరాన్ ట్రినిలి ప్రోల్, 30 నుంచి 35 రోజుల దశలో ఎకరాకు 3 నుంచి 4 కిలోల కార్బోఫ్లోరాన్ గుళికలు, 35 నుంచి 55 రోజుల దశలో లీటర్ నీటికి 0.5 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ లేదా 0.5మి.లీ. స్పైనోటోరం పిచికారీ చేస్తే కత్తెర పురుగు నుంచి పంటను రక్షించుకోవచ్చు.

సంరక్షణ చర్యలు పాటించాలి

మండలంలోని కొన్ని గ్రామాల్లో మాత్రమే కత్తెర పురుగు ఉధృతి ఉంది. విత్తనం వేసినప్పటి నుంచి కత్తెర పురుగు ఆశిస్తుంది. రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి. మమ్మల్ని సంప్రదిస్తే క్షేత్రస్థాయికి వచ్చి చేనును పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తాం.

– విక్రమ్, ఏవో, కుంటాల

చేను ఎండుతోంది



విత్తనం వేసినప్పటి నుంచి కత్తెర పురుగు విపరీతంగా ఉంది. పలురకాల మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేదు. చేను ఎండుతోంది. దిగుబడి తగ్గుతుందని భయంగా ఉంది.

– ఆయిటి రమేశ్, రైతు, కుంటాల

సలహాలు ఇవ్వాలి



రెండెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేసిన. మొక్క ఎదిగినప్పటి నుంచి పురుగు ఆశించింది. మందులు పిచికారీ చేసినా లాభం లేదు. వ్యవసాయాధికారులు సలహాలిచ్చి మా పంటలను కాపాడాలి.

– క్యాదరి సాయన్న, రైతు, కుంటాల

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ఆవు కళేబరం వద్ద రైతులు

లోకేశ్వరం: మండలంలోని నగర్ తండాలో ఆ డేచంద్రుకు చెందిన ఆవు మంగళవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. రోజు మాదిరిగానే తండా నుంచి మేత కోసం ధర్మోర శివారు ప్రాంతానికి ఆవును తీసుకెళ్లాడు. రాజేశ్వర్ అనే రైతు చేను వద్ద విద్యుత్ సరఫరా అవుతున్న తీగ తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. విద్యుత్ ఏఈ శివకుమార్, సిబ్బంది పరిశీలించి పశువైద్య సిబ్బందితో పోస్టుమార్టం చేయించారు. ఆవు విలువ రూ.15 వేలు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు. పశువైద్య సహాయకులు రమేశ్ ఉన్నారు.

'వాసవి' విద్యార్థినికి అవార్డు

నిర్మల్‌టౌన్: ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ 76వ వార్షిక జాతీయ సదస్సులో భాగంగా హైదరాబాద్‌లో గత నెల 22 నుంచి 25వ తేదీ వరకు థీమ్ న్యూరో బయాలజీ ఆఫ్ ఇల్ నెస్ టూ.. వెల్ నెస్ వారు నిర్వహించిన పోటీల్లో జిల్లాకేంద్రంలోని వాసవి వరల్డ్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న ఆరాధ్య లక్ష్మి చక్కని నత్య ప్రదర్శన చేసింది. ఈసందర్భంగా ఆ విద్యార్థినికి యంగ్ డాన్సింగ్ స్టార్ అవార్డు లభించింది. మంగళవారం నిర్మల్‌లో ప్రిన్సిపాల్ శైలజాయ్ చిన్నారికి అవార్డును అందజేశారు. పాఠశాల సెక్రెటరీ జగదీశ్‌రెడ్డి తదితరులు అభినందించారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న భక్తులు

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్‌లో భజరంగ్‌దళ్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రూ.3 లక్షలతో తయారు చేసిన హనుమంతుడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర ఆలయ సమీపంలో నిర్వహించారు. భారీ విగ్రహాన్ని క్రేన్ సాయంతో తీసుకొచ్చి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఇందులో యూత్ సభ్యులు రఘు, వేణు, అజయ్, దిలీప్, జశ్వంత్, పరమేశ్వర్ తదితరులు ఉన్నారు.

పరామర్శ

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన చిలుక నర్సయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. మూడు రోజుల కిందట నర్సయ్య తండ్రి మృతి చెందాడు. అతడితో పదోతరగతి చదివిన మిత్రులు మంగళవారం హైదరాబాద్ వెళ్లి నర్సయ్యను పరామర్శించారు. సయ్యద్, రాజారెడ్డి, ప్రభాకర్, సాయన్న, ఏలేటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖానాపూర్: బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత అని బాలల పరిరక్షణ అధికారి సగ్గం రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులను కోల్పోయి పదోతరగతి ఉత్తీర్ణత అయిన బాలికలకు మహిళ, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. బాల్య వివాహాలు చేసినట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది కాంతారావు, గోవింద్, శ్రీలత, సవిత, మౌనిక, పద్మావతి, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

భూసమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదుల విభాగం

లక్ష్మణచాంద: భూ వివాదాలను పరిష్కరించేందుకు తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జానకి పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు పాల్గొంటారని.. మండలంలోని రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో ఎస్సై సుమలత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎదగని చేనుతో దిగులు

- కంపెనీ మోసంతో నష్టపోయానంటున్న రైతు
- న్యాయం చేయాలని వేడుకోలు



మొక్కలు ఎదగలేదని చూపుతున్న రైతు లక్ష్మణ్

కుభీర్: ఓ కంపెనీ విత్తనాలు నాటి మోసపోయానని.. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు మండలకేంద్రంలోని జాదవ్ లక్ష్మణ్ అనే రైతు. ఇతడు భైంసాలోని ఓ దుకాణంలో ఓ కంపెనీ మొక్కజొన్న విత్తనాలు(ఏడు బ్యాగులు) తీసుకొని తనకున్న 3.5 ఎకరాల్లో నవంబర్ 3న విత్తాడు. మూడు నెలలయిన్పటికీ చేనులో మొక్కలు కనీసం నడుము వరకు పెరగలేదు. సాధారణంగా మొక్కజొన్న పంట మూడున్నర నెలల్లో చేతికొస్తుంది. కానీ ఈ రైతు చేనులో మొక్కలు ఇంకా చిన్నవిగానే ఉన్నాయి. నెలరోజుల కిందట కంపెనీ ప్రతినిధులకు ఫోన్ చేసి విషయం చెప్పానని.. వారు చెప్పిన మందును చేనుపై పిచికారీ చేసినా ఫలితం లేదని రైతు పేర్కొంటున్నాడు. నా వద్ద రసీదు ఉందని.. ఎదగడం లేదని ఫోన్ చేస్తే నువ్వు ఏదైనా చేసుకొమ్మని బాధ్యతారహితంగా మాట్లాడుతున్నట్లు రైతు వాపోయాడు. ఇప్పటికే రూ.60వేల వరకు పెట్టుబడులు అయినట్లు పేర్కొన్నాడు. ఈ పంట చేతికి రాకపోతే నాకు రూ.లక్షకు పైగా నష్టం వస్తుందని.. ప్రభుత్వం స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు.

ఈ విషయమై ఏవో సారికతో 'సాక్షి' మాట్లాడగా తాను సదరు కంపెనీ వారితో మాట్లాడినట్లు చెప్పుకొచ్చారు. రైతు భూమి చవుడు భూమి అని పంట మార్పిడి చేయకపోవడంతో ఇలా జరిగిందని చెప్పినట్లు ఏవో పేర్కొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రమోద్ చంద్రారెడ్డి

నర్సాపూర్(జి): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని అంజనీతండా గ్రామంలో మంగళవారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో నోటి క్యాన్సర్‌పై అవగాహన శిబిరం నిర్వహించారు. పొగాకు, గుట్కా, పాన్, జర్దా, తంబాకు, మత్తు పానీయాలు వంటి వ్యసనాలకు దూరం ఉండాలని నర్సాపూర్(జి) పీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి సూచించారు. సుమారు 90 మంది రోగులకు దంత పరీక్షలు చేసి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. అనంతరం రోగులకు మందులు, మౌత్ వాష్, టూత్ పేస్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐడీఏ నిర్మల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ వెంకటరమణ , క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ అన్వేష్, డాక్టర్ అరవింద్, డాక్టర్ నితీశ్ రాజా, డాక్టర్ నిజాముద్దీన్, పంచాయతీ కార్యదర్శి సంస్కృతి తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

లోకేశ్వరం: మండలంలోని సాథ్‌గాం శివారులోని సుద్దవాగు నుంచి లోకేశ్వరం గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. పలువురు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి హథ్‌గాం ప్రాంతంలో పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించగా.. తహసీల్దార్ మోతీరాం రూ.5 వేల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మొరం టిప్పర్ పట్టివేత

ఖానాపూర్: పట్టణంలో అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ సుజాత తెలిపారు. టిప్పర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి రూ.2500 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. మండలంలోని రంగపేట గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని వారిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయనున్నట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని పెద్ద హనుమాన్ ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను గ్రామ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. తాళ సప్త ధ్వజారోహణ, కలశ స్థాపన, అఖండ తాళ సప్త పూజలను పండితులు పాల్దే నరహరి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్



కుంటాలలో అరెస్టు చేస్తున్న పోలీసులు



కుభీర్ : మాజీ సర్పంచులతో పోలీసు అధికారి

కుంటాల: గ్రామాల్లో చేపట్టిన పనుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచ్‌లు సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నిరసనకు వెళ్లకుండా మండలంలోని మాజీ సర్పంచ్‌లను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు.

పెంబి: బిల్లులు చెల్లించాలంటూ చలో సెక్రెటరీ ముట్టడికి మాజీ సర్పంచ్‌ల రాష్ట్ర ఫోరం పిలుపునిచ్చింది. దీనికి వెళ్లకుండా మండలంలోని మాజీ సర్పంచ్‌లను ఎస్సై హన్మాండ్లు మంగళవారం అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అరెస్టయిన వారిలో పెంబి, ఇటిక్యాల్, కోసగుట్ట మాజీ సర్పంచ్‌లు పూర్ణచందర్ గౌడ్, మహేందర్, రాజు ఉన్నారు.

కుభీర్: మండలంలోని మాజీ సర్పంచ్‌లను కుభీర్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. వారిలో సిర్పెల్లి సర్పంచ్ రాజేందర్, కస్రా సర్పంచ్ అశోక్, చొండి సర్పంచ్ చంద్రకాంత్ ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని ఖథ్‌గాం, హజ్గుల్ మాజీ సర్పంచులు రాజు, ప్రకాశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచు రాజు మాట్లాడుతూ వడ్డీలు కట్టలేక ఇబ్బందులుపడుతున్నామని ప్రభుత్వం తేరుకుని బిల్లులు ఇప్పించాలని కోరారు.

ఈ నల్లాల్లో నీళ్లు రావు..



ఆలయ ప్రధాన ద్వారం వద్ద నల్లాల నుంచి నీరు రావడం లేదంటున్న ఓ భక్తుడు

బాసర: నిత్యం వేలాది మంది వచ్చే శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో తాగునీరు దొరకక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద, వంద వసతి గదుల వద్ద, డార్మెంటరీ హాలు వద్ద ఏర్పాటు చేసిన నల్లాలు నిరుపయోగంగా మారాయి. నల్లాల వద్ద నాచు పేరుకుపోగా.. తాగునీరు రావడం లేదు. ఆలయ అధికారులు స్పందించి.. కనీసం శుద్ధ జలం అందించాలని భక్తులు కోరుతున్నారు.



వంద వసతిగదుల వద్ద నల్లాల దుస్థితి



డార్మెంటరీ హాలు వద్ద..

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తికి సన్మానం

నిర్మల్‌టౌన్: నిర్మల్‌లోని తమ బంధువుల ఇంటికి మంగళవారం వచ్చిన హైకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్‌ను పలువురు సన్మానించారు. గాంధీచౌక్‌లో మాజీ కౌన్సిలర్ మేడారం ప్రదీప్, పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఇందులో పలువురు నాయకులు ఉన్నారు.

ఈవోకు సన్మానం

ముధోల్: ముధోల్ గ్రామపంచాయతీ ఈవోగా అన్వర్ అలీ ఇటీవల బాధ్యతలు స్వీకరించగా..మంగళవారం గ్రామస్తులు ఆయనను సన్మానించారు. ఈయన గతంలో బాసరలో విధులు నిర్వర్తించగా బదిలీపై ముధోల్ వచ్చారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతన ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సంజీవ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.